# నమస్తే తెలంగాణ నిర్మల్

3 | నిజామాబాద్, ఆదివారం 14 జనవరి 2024 | NIRMAL


## క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి..

**బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కుమార్**



పోటీలను ప్రారంభిస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కుమార్

నేరడిగొండ, జనవరి 13 : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కుమార్ అన్నారు. శనివారం నేరడిగొండ మండల కేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఆరుగురిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్ సజన్, స్థానిక సర్పంచ్ పెంట వెంకటరమణ, ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాబ్లె నానక్‌సింగ్, వీడీసీ చైర్మన్ ఏలేటి రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీ పాల్గొన్నారు.

## క్రీడల్లో గెలుపోటములు సహజం



బ్యాటింగ్ చేస్తున్న జాన్సన్ నాయక్

ఖానాపూర్ టౌన్, జనవరి 13 : క్రీడా పోటీల్లో గెలుపు ఓటములు సహజమని, వాటి గురించి ఆలోచించకుండా ఆటల్లో నైపుణ్యం సాధించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ స్పష్టం చేశారు. శనివారం నిర్మల్ జిల్లా ఖానాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఖానాపూర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, ఖానాపూర్ బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బొజ్జు బ్యాటింగ్ చేయగా.. బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ బౌలింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, ఫ్లోర్ లీడర్ సత్యం పాల్గొన్నారు.



జిల్లా పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ అలం

## రోడ్డు ప్రమాదాలను నివారించాలి..

**ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌస్ అలం**

ఎదులాపురం, జనవరి 13 : జిల్లావ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలను నివారించడమే ప్రధాన లక్ష్యమని ఎస్పీ గౌస్ అలం స్పష్టం చేశారు. శనివారం పోలీసు క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలకు గల కారణాలను విశ్లేషించి చర్యలను తీసుకోవాలని సూచించారు. మత్తు పదార్థాల నిర్మూలనకు కృషి చేయాలని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. డీఎస్పీలు నాగేందర్, శ్రీనివాస్, శ్రీనివాస్ జి, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



లారీలు నిలిపి ఆందోళన చేస్తున్న లారీ డ్రైవర్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు

## 'హిట్ అండ్ రన్'పై ఆందోళన


నిర్మల్ అర్బన్, జనవరి 13 : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'హిట్ అండ్ రన్'ను నిరసిస్తూ శనివారం ఆందోళన నిర్వహించారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని శ్యాంఘడ్ ప్రాంతంలో లారీలు నిలిపి నిర్మల్ లారీ డ్రైవర్స్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ అసోసియేషన్ అధ్యక్షుడు అయ్యన్నగారి మధు మాట్లాడుతూ.. ఈనెల 17వ తేదీ వరకు లారీలను నిలుపుతామన్నారు. కేంద్ర ప్రభుత్వం సమస్యలను పరిష్కరించని పక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# ఎస్-6 సేఫ్

**పశువును వేటాడుతూ కెమెరాకు చిక్కిన పులి**

- ఇప్పటికే మరో రెండు పులి పిల్లల పాదముద్రలు గుర్తింపు
- చనిపోయిందనుకున్న పులి బతికి ఉండడంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు

మంచిర్యాల, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పులి పిల్లల సెర్చ్ ఆపరేషన్ ఓ కొలిక్కి వచ్చింది. విష ప్రయోగంతో ఎస్-9(మగ పులి)తోపాటు మరో పిల్ల పులి ఎస్-15 కూడా మృత్యువాత పడిన విషయం తెలిసిందే. ఈనెల మొదటివారంలో రెండు రోజుల తేడాతో రెండు పులుల మృతి రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ రెండు పులులతోపాటు మరొకటి కూడా విష ప్రయోగం చేసిన పశు మాంసాన్ని తిన్నట్లు తెలియడంతో ఎస్-9 జతగా ఉన్న ఆడపులి ఎస్-6తోపాటు దాని మరో రెండు పులి పిల్లల జాడపై ఉత్కంఠ నెలకొన్నది. దీంతో నాలుగు రోజులుగా అధికారులు కంటి మీద కునుకు లేకుండా అడవిని జల్లెడ పడుతున్నారు. ఈ క్రమంలో దరిగాం అటవీ ప్రాంతంలో ఎస్-6 పులి ఓ పశువును వేటాడుతూ సీసీ కెమెరాకు చిక్కింది. ఈ నెల 11వ తేదీన రికార్డు అయిన ఈ దృశ్యాన్ని శనివారం అధికారులు విడుదల చేశారు. చనిపోయి ఉంటుందని భావిస్తున్న పులి కెమెరాకు చిక్కడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. దాని పిల్లలైన మరో రెండు పులి పిల్లల పాదముద్రలు కూడా తాజాగా దొరకడంతో ఎస్-6తో దాని సంతానమైన మరో రెండు పులులు క్షేమంగా ఉన్నట్లుగా భావిస్తున్నారు. కాకపోతే మిగిలిన పులుల పాద ముద్రలతోపాటు సీసీ కెమెరాల్లో లేదా లైవ్ కెమెరాల్లో ఆ పులులు కనిపించాల్సి ఉంటుంది. కాగా.. ఎస్-6తోపాటు పిల్లల్లో ఒకటైన మరో పులిని ఓ అధికారి అడవిలో చూసినట్లుగా చెప్తున్నారు. ఇక పులుల జాడ కోసం సెర్చ్ ఆపరేషన్ శనివారం కొనసాగింది. దాదాపు 80 మంది అధికారులు 12 నుంచి 13 బృందాలుగా విడిపోయి అడవిని జల్లెడ పట్టారు. మిగిలిన పులుల జాడ తెలిసే వరకు ఈ సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందని అధికారులు తెలిపారు.



### ఎస్-10పై అధికారుల ఆశలు

ఎస్-6(ఆడపులి) జతగా ఉన్న ఎస్-9 మృతి చెందడంతో కాగజ్‌నగర్ రేంజ్‌లో పులుల మనుగడపై నీలినీడలు కమ్ముకున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతోపాటు స్థానికుల ఆగ్రహం పులి మరణానికి దారి తీయడం అటవీ శాఖ అధికారుల్లో పెద్ద చర్చనీయంగా మారింది. నిబంధనల ప్రకారం పులుల ఆచూకీని బయట ఎవరికీ చెప్పకూడదు. పులి సంచరిస్తున్నదని తెలిస్తే స్థానికంగా ఉంటే వేటగాళ్లకు సమాచారం ఇచ్చినట్లు అవుతుందని జాగ్రత్తలు పాటిస్తారు. కానీ.. వరుసగా రెండు పులుల మరణంతో మీడియా ఫోకస్ మొత్తం అటవీ శాఖపైకి మళ్లింది. పులులు ఏమయ్యాయి? బతికున్నాయా? చనిపోయాయా? అనే సమాచారం రోజూ బయటికి వెళ్తున్నది. దీంతో జాగ్రత్తలు వహిస్తున్నామని అటవీ శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. అందుకే ఎస్-6 రికార్డును రెండు రోజులు ఆలస్యంగా విడుదల చేసినట్లు చెప్పారు. ఎస్-9 మృతి చెందినప్పటికీ సిర్పూర్ రేంజ్‌కు ఇటీవల వచ్చిన ఎస్-10 (మగ పులి) కదలికలను గుర్తించినట్లుగా సదరు అధికారి తెలిపారు. ఎస్-6తో జత కట్టడానికి అది సరిగ్గా సరిపోతుందనే అభిప్రాయం వ్యక్తం చేశారు. కాకపోతే ఆ పులి పాదముద్రలు మాత్రమే ఇప్పటివరకు అధికారులకు దొరికాయి. అది కూడా కెమెరా ట్రాప్‌లో ఎక్కడా దొరకలేదు. సిర్పూర్ మండలం వేంపల్లి, చీలపల్లి అటవీ ప్రాంతాల్లో ప్రస్తుతం అది సంచరిస్తున్నట్లు చెప్తున్నారు. మొత్తంగా కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, సిర్పూర్ రేంజ్‌లలో 10కి పైగా పులులు నిత్యం సంచరిస్తున్నాయి. తాజాగా.. రెండు పులుల వరుస మరణాలతో మిగిలిన పులుల రక్షణపై ప్రత్యేక దృష్టి సారించారు. త్వరలోనే మహారాష్ట్ర అటవీ శాఖ అధికారులతో తెలంగాణ అధికారులు సమావేశమై పులుల సంరక్షణ, నిత్యం రాకపోకలు సాగించే పులుల సమాచారం ట్రాక్ చేయడం తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలిసింది.



దరిగాం అటవీ ప్రాంతంలో గుర్తించిన పులి పాదముద్రలు



నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న శ్రీజ

## ఆపన్నహస్తం అందించరూ..

- నాలుగేండ్లుగా క్యాన్సర్‌తో పోరాడుతున్న యువతి
- ఇప్పటికే రూ.16 లక్షలకుపైగా ఖర్చు
- దాతల సాయం కోసం ఎదురుచూపు
- ఆదుకోవాలని విన్నపం

లక్ష్మణచాంద, జనవరి 13 : నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలోని పార్‌పెల్లి గ్రామానికి చెందిన ఆరోల్ల శ్రీజ క్యాన్సర్‌తో బాధపడుతున్నది. చదువులో చురుగ్గా ఉండే శ్రీజకు.. మూడేండ్ల క్రితం కాలుకు క్యాన్సర్ సోకింది. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తీసుకెళ్లగా.. కాలు తీసేయాలని వైద్యులు సూచించారు. కాలు కూడా తీసేయించినా.. వ్యాధి తీవ్రత పెరుగుతూ వచ్చింది. ఇప్పటివరకు చాలా దవాఖానలు తీరుగగా.. రూ.16 లక్షలకు పైగా ఖర్చయ్యాయి. ఉన్నవి అమ్ముకొని వైద్యం చేయించడంతో ఇప్పుడు ఏమి లేకుండా అయింది. రోజు దవాఖానకు తీసుకెళ్తుండడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆమె తండ్రి ఆరోల్ల రమేశ్ వాపోతున్నారు. వైద్యం చేయించలేని స్థితిలో ఉండడంతో దాతలు ముందుకొచ్చి ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

**యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ :**
**228210100052091**
**(శ్రీజ తండ్రి ఆరోల్ల రమేశ్)**
**ఐఎఫ్ఎస్సీ కోడ్ : యూబీఐఎన్ 822825**
**ఫోన్ పే : 8106572516**
**(శ్రీజ తల్లి ఆరోల్ల రాజ్యలక్ష్మి)**



బజార్‌హత్నూర్ రంగురంగుల ముగ్గులు వేస్తున్న మహిళలు, యువతులు(ఫైల్)



చెన్నూర్ పట్టణంలో గంగిరెద్దుల విన్యాసాలు (ఫైల్)

# పల్లెల్లో పండుగ సందడి

- సొంతూళ్లకు జనం.. ఇంటింటా బంధుగణం
- పిండివంటల ఘుమఘుమలు
- ఆకట్టుకుంటున్న గంగిరెద్దుల విన్యాసాలు

**నేడు భోగి, రేపు సంక్రాంతి, ఎల్లుండి కనుమ**

బజార్‌హత్నూర్, జనవరి 13: పల్లెల్లకు పండుగ కళ వచ్చేసింది. ఊరూవాడా సందడిగా మారింది. ప్రతి ఇంట్లో సంక్రాంతి పండుగ సందడి కనిపిస్తున్నది. ఏడాదిలో 12 సార్లు 12 రాశుల్లో సూర్యుడి సంక్రమణ జరుగుతుంది. సూర్యుడు ధనూరాశి నుంచి మకరరాశిలోకి ప్రవేశించే రోజును సంక్రాంతిగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. 14వ తేదీ భోగీ, 15న సంక్రాంతి, 16న కనుమ పండుగ ఆనందోత్సాహాలతో నిర్వహించుకునేందుకు పట్నాల నుంచి ప్రజలు పల్లెల బాట పట్టారు.

**భోగి పండుగ :** సూర్యోదయానికి ముందే వేకువజామున ఇంటిముందు చలిమంటలు వేసి పిల్లలకు నూనె, గట్టి పిండితో నలుగుపెడతారు. సాయంకాలం చిన్నపిల్లలను ఇంట్లో అందంగా వేసిన ముగ్గులపై పీట పెట్టి దానిపై కూర్చోబెడతారు. చెంబులో రేగు పండ్లు, బియ్యం, చెరుకు ముక్కలు, ఎండు కొబ్బరి ముక్కలు, పోకలు (బియ్యం మమ చేసినవి), చిల్లర డబ్బులు పిల్లల నెత్తిపైనుంచి పోస్తారు. పెద్దలతో దీవెనలిప్పిస్తారు. చక్కిలాలు, పండ్లను వాయినాలుగా ఇస్తారు.

**సంక్రాంతి.. :** సూర్యుడిని ప్రత్యేకంగా పూజించే పండుగ సంక్రాంతి. రైతుకు కొత్త పంటలు ఇంటికి చేరి ధాన్యలక్ష్మి 'సంక్రాంతి లక్ష్మి'గా దర్శనమిస్తుంది. కొందరు పితృదేవతలకు తర్పణం ఇస్తారు. ప్రత్యక్షదైవమైన సూర్యునికి తెలుపు రంగు ఇష్టం కాబట్టి, సూర్యోదయానికి ముందు పొంగలి (పాయసాన్నం) చేస్తారు. ఆడపిల్లలు తెల్లవారకముందే కళ్లాపి చల్లి రంగురంగుల ముగ్గులు వేస్తారు. మగ పిల్లలు పతంగులను ఎగురవేస్తారు. ముగ్గుల మధ్య లో ఆవు పేడను గొబ్బెమ్మలుగా చేసి బంతిపూలతో అలంకరిస్తారు. రేగుపండ్లు, చిక్కుడు కాయలు, బియ్యం, నూలు వాటి చుట్టూ పోస్తారు. హరిదాసులకు, గంగిరెద్దులవారికి ధాన్యాన్ని, డబ్బులను దానం చేస్తారు. 'అయ్యగారికి దండంపెట్టు.. మంచిజరగాలని దీవించు..' అంటూ తలూపే గంగిరెద్దుల సందడి కనిపిస్తుంది.

**కనుల పండువగా కనుమ :** మూడో రోజు కనుమ పండుగ. కనుమనాడు ముత్తయిదువలకు పసుపురాసి, బొట్టుపెట్టి ఒక్కొక్కరికి నోము ఇస్తారు. చక్కెర, నువ్వుల పొడి చేతిలో పెట్టి 'తీపి తిని తియ్యగా మాట్లాడు.. నూలు తిని నూరేళ్ల బతుకు' అని దీవిస్తారు. పెద్ద ముత్తయిదువల దీవెనలందుకుంటారు. చలికాలం పూట నువ్వులు, బెల్లం ఉష్ణాన్నందిస్తాయి. వ్యవసాయంలో తమకు చేదోడువాదోడుగా ఉండే పశువులకు పూజ చేస్తారు. వనభోజనాలు కూడా ఈరోజే నిర్వహిస్తారు.

### ఆకట్టుకుంటున్న పతంగులు

పండుగ వేళ చిన్నారులు గాలిపటాలను ఎగరవేస్తున్నారు. వెరైటీ వెరైటీ పతంగులు ఆకట్టుకుంటున్నాయి. సాధారణ పతంగులతో పాటు సీతాకోకచిలుక, డ్రాగన్, తేలు, పాము పక్షి రూపంలో ఉన్న వెరైటీ పతంగులను చిన్నారులు ఇష్టపడుతున్నారు.

# ఆర్థిక నేరాలకు ముకుతాడు..

- ఊతమిస్తున్న కేసీఆర్ ప్రభుత్వ నిర్ణయాలు
- పోలీసింగ్‌లో అడుగడుగునా సాంకేతికత
- తగ్గుతున్న సాధారణ, సైబర్ నేరాలు
- ఆన్‌లైన్ ఫ్రాడ్ కేసుల్లో రూ.19 లక్షల రికవరీ



సైబర్ నేరాల ఛేదన కోసం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఐటీ విభాగం

నిర్మల్, జనవరి 13(నమస్తే తెలంగాణ) : కేసీఆర్ ప్రభుత్వం పోలీస్ వ్యవస్థను అత్యంత పటిష్టంగా మార్చింది. దీని ఫలితంగా సాధారణ నేరాలతోపాటు సైబర్ క్రైం లను కూడా పోలీసులు సులువుగా ఛేదించగలుతున్నారు. ప్రధానంగా నేరాల ఛేదన, అదుపునకు 'దర్పన్' యాప్ దన్నుగా నిలుస్తున్నది. ఇందులో రాష్ట్ర, దేశంలోని నేరస్తుల వివరాలను పూర్తిస్థాయిలో పొందుపర్చారు. దర్పన్ యాప్‌తోపాటు, మిగతా సైబర్ నేరాలను పరిశీలించేందుకు జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి, సిబ్బందిని నియమించారు. సీఈఐఆర్ పోర్టల్, సైబర్ క్రైం విభాగాన్ని ఎస్పీ పర్యవేక్షిస్తున్నారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా జిల్లావ్యాప్తంగా 429 సెల్‌ఫోన్‌లను వాటి యజమానులకు అప్పగించారు. ఈ క్రమంలో తాజాగా నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని నగర్ కాలనీకి చెందిన దీక్షిత్ సైబర్ క్రైం ఉచ్చులో చిక్కుకున్నాడు. ఆయన రూ.18,95,990 లు పోగొట్టుకోగా.. ఇందులో రూ.13,19,914లను రికవరీ చేసి బాధితుడికి అప్పగించారు. ఇప్పటివరకు వివిధ కేసుల్లో సైబర్ మోసాల్లో డబ్బులు కోల్పోయిన బాధితులకు రూ.19,29,476లను తిరిగి ఇప్పించారు.

### 1930 నంబర్‌కు కాల్ చేయండి..

నిర్మల్ పోలీసు కార్యాలయంలో సైబర్ నేరాలను అదుపు చేసేందుకు ఐటీ కోర్ విభాగాన్ని ఏర్పాటు చేశారు. కాగా.. ఆన్‌లైన్ మోసాల్లో డబ్బులు పోగొట్టుకున్నవారు వెంటనే 1930 నంబర్‌కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచిస్తున్నారు. ఫిర్యాదు అందిన వెంటనే ఫ్రాడ్ జరిగిన సైట్లను, సిమ్ కార్డు, బ్యాంకు ఖాతాను పోలీసులు బ్లాక్ చేస్తారు. దీనికితోడు రహస్య యాప్‌లను అస్త్రాలుగా మలుచుకుంటూ నేరస్తుల జాడను కనిపెడతారు. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 272 సైబర్ క్రైం ఫిర్యాదులు వచ్చినట్లు పోలీసులు చెబుతున్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం, వాట్సాప్‌ల ద్వారా మహిళలు, యువతులకు అసభ్యకరమైన మెసేజ్‌లు పెట్టి ఇబ్బందులకు గురిచేసిన వారిపై కూడా చర్యలు తీసుకుంటున్నారు.

### విస్తృత ప్రచారం..



సైబర్ నేరాలు ఒకప్పుడు హైదరాబాద్ లాంటి పెద్ద నగరాల్లో మాత్రమే జరిగేవి. ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరించాయి. వీటి బారిన పడకుండా ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన పాస్‌వర్డ్స్ ఎవరికీ చెప్పకూడదు. అనుమానిత వెబ్‌సైట్లను బ్రౌజ్ చేయవద్దు. ఎన్నికలు వస్తున్నాయి. మీ ఓటరు కార్డు అప్‌డేట్ చేస్తాం, ఆధార్ కార్డు నంబర్ చెప్పండి అంటూ ఫోన్ చేస్తారు. పింఛన్‌దారులకు ఫోన్ చేసి మీ ఆధార్‌కు ఈకేవైసీ చేయాలి.. లేకుంటే మీ పింఛన్ నిలిచి పోతుందని.. ఇలా రకరకాలుగా మోసాలకు పాల్పడుతుంటారు. ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి. ఆన్‌లైన్ మోసాలు జరిగినప్పుడు 24 గంటల్లోగా ఫిర్యాదు చేస్తే డబ్బులు రికవరీ చేసే అవకాశం ఉంటుంది. సైబర్ నేరాలపై జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో స్కూళ్లు, కాలేజీలతోపాటు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం.

*- జానకీ షర్మిల, ఎస్పీ, నిర్మల్.*

## ప్రాణం తీసిన ప్రేమ వివాహం

- నిర్మల్‌లో మామఅల్లుళ్లపై దాడి ఘటనలో వీడిన మిస్టరీ
- అమ్మాయి కుటుంబ సభ్యులే కారణం
- బుచ్చన్న, ఆయన కొడుకు నవీన్‌పై కక్ష
- నవీన్ టీ షర్ట్ వేసుకోవడంతో పొరపడి వెంకటేశ్‌పై దాడి
- నిందితులను రిమాండ్ తరలించిన పోలీసులు




వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

నిర్మల్ అర్బన్, జనవరి 13: జిల్లా కేంద్రంలో కలకలం సృష్టించిన హత్య కేసును పోలీసులు 24 గంటల్లోనే ఛేదించారు. పట్టణంలో శనివారం డీఎస్పీ గంగారెడ్డి హత్య కేసు వివరాలు వెల్లడించారు. నిర్మల్ మండలంలోని అనంతపేట్ గ్రామానికి చెందిన పోలీసు బుచ్చన్న కుమారుడు నవీన్ ఇంటి ఎదురుగా ఉండే సంటి భీమన్న కుమార్తె ప్రవళికను ఆరు నెలల క్రితం ప్రేమించి పెండ్లి చేసుకున్నాడు. అయితే వరుసలు కలువవని, భీమన్న వారి కుటుంబసభ్యులకు వివరించినా వినలేదు. అయితే ఊళ్లో ఉండొద్దని, వేరే చోటకు వెళ్లి బతకమని చెప్పాడు. అయితే ఇందుకు బుచ్చన్న ఒప్పుకోలేదు. నీ కండ్ల ముందే బతుకుతారని రెచ్చగొట్టాడు. ఇటీవల ప్రవళికకు సీమంతం కూడా జరిపించడంతో, మరింత అవమానంగా భావించి బుచ్చన్నను, నవీన్‌ను చంపేయాలని నిర్ణయించుకున్నాడు. తన రెండో కుమారుడు ప్రమోద్‌తో కలిసి భీమన్న పథకం వేసుకున్నాడు. కాగా, శుక్రవారం మధ్యాహ్నం బుచ్చన్న, కొడుకుతో కలిసి నిర్మల్ వెళ్తున్నారని తెలుసుకున్నారు. బంగల్‌పేట్ వద్దగల జంగల్‌హనుమాన్ దారిలో కాపు కాశారు. వారు రాగానే విచక్షణా రహితంగా దాడి చేశారు. దీంతో బుచ్చన్న అక్కడికక్కడే మృతి చెందాడు.తండ్రికొడుకులిద్దరిని చంపాలని మాత్రమే వీరు అనుకున్నారు. నవీన్ టీషర్టు వేసుకోవడంతో పొరపడి వెంకటేష్‌ను కత్తితో కడుపులో దాడి చేశారు. ప్రస్తుతం వెంకటేశ్ చికిత్స పొందుతున్నాడు. కొండాపూర్ బైపాస్ వద్ద నిందితులు తిరుగుతుండగా పట్టుకుని విచారించడంతో హత్య చేసినట్లు ఒప్పుకున్నారు. వీరిపై ఐపీసీ 302,307 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు, బరిసె, గొడ్డలిని స్వాధీనం చేసుకున్నారు.

## నాగోబా జాతరకు శ్రీకారం

- ప్రత్యేకంగా సమావేశమైన మెస్రం వంశీయులు
- రాత్రి నెలవంకకు సంప్రదాయ పూజలు
- నేటి నుంచి ఎడ్లబండి ప్రచారం మొదలు

ఇంద్రవెల్లి, జనవరి 13: మండలంలోని కెస్లాపూర్ నాగోబా జాతర నిర్వహణ కోసం మెస్రం వంశీయులు శ్రీకారం చుట్టారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మెస్రం వంశీయులు కెస్లాపూర్ గ్రామానికి శనివారం చేరుకొని గ్రామంలోని పురాతన నాగోబా దేవస్థానం(మురాడి)లో రాత్రి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాత్రి కనిపించిన నెలవంకకు మెస్రం వంశీయులు సంప్రదాయరీతిలో ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా గ్రామంలోని(మురాడి)లోని నాగోబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి 9న నాగోబాకు నిర్వహించే మహాపూజలతోపాటు జాతర నిర్వహణ, పవిత్ర గంగాజలం సేకరణకు గ్రామాల్లో ప్రచారం నిర్వహించే ఎడ్లబండిని ఆదివారం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మెస్రం వంశీయుల పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్‌పటేల్, చిన్నూపటేల్, బాజీరావ్ పటేల్, లింబారావ్‌పటేల్, కోసు కటోడ, కటోడ హనుమంత్‌రావ్, కోసేరావ్ కటోడ, మెస్రం మనోహర్, గణపతి, దాదారావ్, తిరుపతి, దేవ్‌రావ్, సోనేరావ్, నాగ్‌నాథ్, తుకారామ్, ఆనంద్‌రావ్, జంగుబాపు, షేకు, శేగ్‌నాథ్, మారుతి, చిత్రు, తదితరులు పాల్గొన్నారు.



పాత నాగోబా(మురాడి)లో పూజలు చేస్తున్న మెస్రం వంశీయులు

## లక్కీడ్రా అంటూ మోసం

**మూడు తులాల బంగారంతో పరార్**

నిర్మల్ అర్బన్, జనవరి 13 : లక్కీడ్రా వచ్చిందంటూ మోసం చేసి బంగారంతో పరారైన ఘటన నిర్మల్ పట్టణంలోని శాంతినగర్ కాలనీలో చోటు చేసుకున్నది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. శాంతినగర్ కాలనీకి చెందిన ఒల్లెపు రాధ ఇంటికి శనివారం గుర్తు తెలియని వ్యక్తి వచ్చి తమ పూర్తి వివరాలు తెలిపి మీకు లక్కీడ్రా వచ్చిందంటూ మాటల్లో దింపాడు. రెండు తులాల బంగారం వచ్చింది. నావద్ద ఐదు తులాల బిస్కెట్ బంగారం ఉంది. మీవద్ద ఉన్న బంగారాన్ని ఇవ్వండి బిస్కెట్ బంగారం ఇస్తాను అని మాటల్లో దించాడు. వారి వద్ద ఉన్న మూడు తులాల బంగారాన్ని తీసుకుని తూకం వేసి నావద్ద ఉన్న బంగారాన్ని ఇస్తాను అని చెప్పాడు. దీంతో తాను తీసుకొచ్చిన బైక్‌పై ఒకరిని ఎక్కించుకుని స్థానిక సబ్ రిజిస్ట్రార్ వద్ద గల ఓ బంగారు దుకాణానికి వెళ్లాడు. తన వెంట వచ్చిన వ్యక్తిని ఇక్కడే ఉండమని చెప్పి అక్కడి నుంచి పరారయ్యారు. మోసపోయామని భావించిన రాధ నిర్మల్ పట్టణ పోలీసులను ఆశ్రయించింది. సీసీ పుటేజీ ఆధారంగా నిందితులను పోలీసులు గుర్తిస్తున్నారు.